క్లుప్తంగా

వేణుగోపాల స్వామి హుండీ లెక్కింపు


శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో పరకామణి

కార్వేటినగరం: ప్రసిద్ధి చెందిన శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయం హుండీ ఆదాయం రూ.1.25 లక్షలు వచ్చినట్లు టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. గురువారం ఆలయ ఆవరణలో పరకామణి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారి మాట్లాడుతూ స్వామివారికి రూ.1,25,757 హుండీ ద్వారా ఆదాయం వచ్చిందన్నారు. ఈ మొత్తాన్ని స్వామివారి ఖాతాల్లో జమ చేస్తామని ఆయన పేర్కొన్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు. అలాగే టీటీడీ అనుబంధంగా ఉంటున్న ఆలత్తూరులోని శ్రీవరద వెంకటేశ్వర స్వామి ఆలయానికి హుండీ ద్వారా రూ.1822 ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షరాబు బాబుసురేష్, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

తొలిరోజు పుస్తకాలతో సరి


పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఏపీసీ గౌరీశంకరరావు

పుత్తూరు: ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ మంచి ఫలితాలు సాధించాలని సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ గౌరీశంకరరావు సూచించారు. గురువారం పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా స్థానిక గేట్‌పుత్తూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు టెక్ట్స్, నోట్‌బుక్స్, యూనిఫాంను విద్యార్థులకు పంపిణీ చేశారు. స్థానిక భవిత, మెయిన్ స్కూల్‌లో బుక్స్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అయితే విద్యార్థులకు స్కూల్ బ్యాగు, షూస్, బెల్ట్ సైతం పంపిణీ చేయలేదు. ఇవి ఇప్పటి వరకు పాఠశాలలకు అందనే లేదు. దీంతో విద్యార్థులకు అందే అవకాశం ఉందో లేదో అన్న అనుమానం తల్లిదండ్రుల్లో నెలకొంది. కార్యక్రమంలో సీఎంఓ సురేష్, ఎంఈఓ తిరుమలరాజు, గేట్‌పుత్తూరు విద్యా కమిటీ చైర్మన్ శంకర్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్దతు ధరకే మామిడి కొనాలి


సన్‌గోల్డ్ ఫ్యాక్టరీలో ఆర్డీఓ భవాని

బంగారుపాళెం: జ్యూస్ ఫ్యాక్టరీ యజమానులు తోతాపురి మామిడిని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే రైతుల నుంచి కొనుగోలు చేయాలని పలమనేరు ఆర్డీఓ భవాని ఆదేశించారు. గురువారం మండలంలోని నలగాంపల్లెలో ఉన్న సన్‌గోల్డ్ జ్యూస్ ఫ్యాక్టరీని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ తోతాపురి రకానికి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను విధిగా అమలు చేయాలని ఫ్యాక్టరీ యజమానులకు దిశానిర్దేశం చేశారు. రైతులకు మద్దతు ధర అమలయ్యేలా సంబంధిత అధికారులు సహకరించాలన్నారు. తహశీల్దార్ బాబు రాజేంద్ర ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రులే సురక్షితం

తవణంపల్లె: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు సురక్షితమని వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ తెలిపారు. గురువారం మండలంలోని తెల్లగుండ్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, మహిళలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవించడం వల్ల తల్లీబిడ్డ క్షేమంగా ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. రక్తహీనత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ శ్రీహరి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ పాల్గొన్నారు.

అంతా చెత్తమయం

- పుత్తూరులో ఎటు చూసినా చెత్త
- వ్యర్థాలతో నిండి పూడిపోయిన డ్రెయినేజీలు
- వారానికోసారి ఇంటింటా చెత్త సేకరణ
- దోమలు పెరిగి రోగాల బారిన ప్రజలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు


పిళ్లారిపట్టు రోడ్డులో పేరుకున్న చెత్త

పట్టణంలోని ఏ వీధిలోకి వెళ్లినా, ఎటు చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. అసలే మామిడి సీజన్ కావడంతో చెత్తకుప్పల నుంచి దుర్వాసన, దోమలు, ఈగలతో ప్రజల అవస్థలు వర్ణనాతీతం. పారిశుధ్యం నిర్వహణ అధ్వాన్నంగా మారింది. డ్రెయిన్లు సైతం వ్యర్థాలతో నిండిపోయి, మురుగు ముందుకు సాగడం లేదు. దీంతో డ్రెయిన్లు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారడంతో రాత్రిళ్లు ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. ఫలితంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పుత్తూరు మున్సిపల్ అధికారులు పారిశుధ్యంపై ఏమాత్రం శ్రద్ధ చూపకపోవడం లేదంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

–పుత్తూరు

ఆంధ్రప్రదేశ్‌ను పరిశుభ్ర రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమం నుంచి పుత్తూరు పట్టణానికి మినహాయింపు ఇచ్చినట్లు కనిపిస్తోంది. స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్ కార్యక్రమం ద్వారా పలు రకాల పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు ప్రకటించారు. మాస్ క్లీన్ డ్రైవ్, బహిరంగ ప్రదేశాలను, చెత్త కుప్పలను, కాలువలను, పబ్లిక్ టాయిలెట్స్‌ను శుభ్రం చేస్తామని వివరించారు. అలాగే రోడ్లకు ఇరువైపులా పెరిగిపోయిన పిచ్చి మొక్కలను తొలగిస్తామన్నారు. ఇందులో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. అయితే ఇవేవీ పుత్తూరులో జరగడం లేదు. ఇంటి వద్దకు వచ్చి చెత్త సేకరణ కార్యక్రమం గతంలో సక్రమంగా జరిగేది. ప్రస్తుతం అదికూడా వారానికోసారి సిబ్బంది వీధుల్లోకి వస్తుండడంతో విధిలేక ప్రజలు తడ, పొడి చెత్తలను వీధుల్లోనే పారబోస్తున్నారు. దీంతో ఎటు చూసినా పుత్తూరు చెత్తమయంగా కనిపిస్తోంది.

మురుగు పారితే ఒట్టు

పట్టణంలోని ప్రధాన డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. వివిధ ప్రాంతాల కాలువలను ప్రధాన రహదారి డ్రెయినేజీకి అనుసంధానం చేశారు. ఎలుకలు తవ్వడం, వ్యర్థాలతో పూడిపోవడంతో మురుగునీరు సజావుగా ముందుకు సాగడం లేదు. ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోతోంది. దీంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. పట్టణంలో ఉన్న హోటళ్లు, మాంసం దుకాణాలు, కూరగాయలు, జనరల్ స్టోర్స్ నిర్వాహకులు సైతం చెత్తను డ్రెయిన్లలో వేయడంతో పరిస్థితి దారుణంగా తయారవుతోంది.


ధర్మరాజుల గుడి ముందే చెత్త

శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీ

60 వేలకు పైగా జనాభా కలిగిన పుత్తూరు మున్సిపాలిటీలో గత ఏడాదిన్నరగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. ఏడాదిన్నర క్రితం శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా మోతీలాల్ పనిచేశారు. ఆయన బదిలీపై వెళ్లడంతో అప్పటి నుంచి నేటి వరకు ఆ పోస్టు ఖాళీగానే ఉంది. సచివాలయ సెక్రెటరీల్లో ఎవరినో ఒకరిని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా మున్సిపాలిటీ మొత్తం బాధ్యతలను అప్పగించడం ద్వారా వారు పూర్తి స్థాయిలో పనిచేయలేక పోతున్నారు. ఈ రీతినే ఓ మహిళా కార్యదర్శికి ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాధ్యతలు అప్పగించారు. అయితే ఆమె చెప్పినట్లు ఇతర సిబ్బంది పని చేయకపోవడంతో పట్టణంలో పారిశుధ్యం సమస్య రోజురోజుకు తీవ్రతరమవుతోంది. పారిశుధ్యంలో కీలక పాత్ర పోషించే మేస్త్రీ పోస్టులు పుత్తూరుకు రెండు ఉండగా ఓ పోస్టు సైతం ఖాళీగా ఉండడం గమనార్హం.

సామూహిక సీమంతాలు


శిశువులకు అక్షరాభ్యాసం

గంగాధరనెల్లూరు: మండలంలోని నెల్లేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు సామూహిక సీమంతం, శిశువులకు అక్షరాభ్యాసం సీడీపీఓ పద్మసునంద ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం గర్భిణీలకు అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతం నిర్వహిస్తామన్నారు. గర్భిణీలకు పౌష్టికాహారం అందించారు. అలాగే ఇంటి పరిసరాలలో లభించే పండ్లు, వివిధ రకాల కూరగాయల నుంచి పౌష్టికాహారం తయారుచేసే విధానంపై మహిళలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ గంగయ్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

జనుము విత్తనాలు పంపిణీ

పుత్తూరు: మండల పరిధిలోని తిరుమలకుప్పం గ్రామంలో గురువారం జనుము విత్తనాలను 50 శాతం సబ్సిడీతో వ్యవసాయాధికారి కోదండయ్య రైతులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులు జనుము విత్తనాలు వాడడం ద్వారా రసాయనిక ఎరువుల వాడకం తగ్గించుకోవచ్చునని తెలిపారు. సీసీఆర్‌సీ కార్డ్స్, ఈకేవైసీ, నవధాన్యాలను వివరించారు. కార్యక్రమంలో జడ్‌బీఎన్ఎఫ్ స్టాఫ్ లత మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకంతో కలిగే నష్టాలను వివరించారు. రైతులు మంచి దిగుబడులు సాధించడానికి సేంద్రీయ వ్యవసాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

వధూవరులకు మాజీ మంత్రి ఆశీస్సులు


వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి: వీకేఎం కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన వైఎస్ఆర్ సీపీ ముస్లిం మైనారిటీ కార్యదర్శి మూసా భాయ్ కుమారుడు జాకీర్ హుస్సేన్, హలియా వివాహ మహోత్సవంలో మాజీ మంత్రి ఆర్కేరోజా పాల్గొన్నారు. నూతన వధూవరులకు ఆశీస్సులను అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధికి అధికారులు సహకరించాలి


బెల్ట్‌షాపులపై మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్


ప్రోటోకాల్ పాటించకుండా హాజరైన టీడీపీ నాయకులు

పాలసముద్రం: మండల పరిధిలోని గ్రామాల్లో అభివృద్ధి పనులకు అధికారులు సహకరించాలని ఎంపీపీ శ్యామల తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఏఓ మధువాణి ఆధ్వర్యంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ శ్యామల మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతి నిధులు తాగునీరు, పారిశుధ్యంపై ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు అన్బగలన్ మాట్లాడుతూ మండలంలో బెల్ట్‌షాపుల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నా ఎక్సైజ్ శాఖ, పోలీసులు పట్టించుకోవడం లేదని నిలదీశారు. బెల్ట్‌షాపులను వెంటనే అరికట్టాలని తెలిపారు. పీహెచ్‌సీకి మరొక వైద్యాధికారిని అధికారులు దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. ఉపాధిహామీ పథకంలో గోకులం షెడ్లకు బిల్లులు ఇవ్వలేదని అధికారుల దృష్టికి తెచ్చారు. పీహెచ్‌సీ సీహెచ్ఓ జ్ఞానశేఖర్ మాట్లాడుతూ వైద్య పరీక్షలు చేసుకోవాలంటే తప్పకుండా ఆధార్‌కార్డు, ఆధార్ కార్డు లింక్ చేసిన ఫోన్ తీసుకురావాలని సూచించారు. వెంగళరాజుకుప్పం చెరువులో తూములో నీరు పోకుండా కాంక్రీట్ వేశారని, ఈ కాంక్రీట్ తీసివేస్తే 250 ఎకరాల భూమిలో పంటలు సాగు చేసుకోవచ్చని తెలిపారు. సర్వసభ్య సమావేశానికి ప్రోటోకాల్ మీరి టీడీపీ నాయకులు హాజరయ్యారు కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పుష్ప, ఎంపీటీసీ లిఖిత, గోవిందరాజ్, కుప్పమ్మ, సర్పంచ్ శేఖ, అనురేఖ, అయ్యప్ప, జీవిత, ఎంఈఓలు రాజేంద్రప్రసాద్, గిరిజ, ఐకేపీ ఏపీఎం కల్పలతరెడ్డి, ఏపీఓ మార్గెట్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ, ఏఈ జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


శ్రీహరిపురం మోడల్ స్కూల్‌లో పిల్లలను చేర్పుతున్న తల్లిదండ్రులు

విజయపురం: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు శ్రీహరిపురం మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు వెంకమరాజు అన్నారు. గురువారం పాఠశాల పునఃప్రారంభంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. కొత్తగా చేరిన పిల్లలకు ఉపాధ్యాయులు స్వీట్లు అందించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పాలని కోరారు.

మొక్కల పెంపకం అందరి బాధ్యత


మొక్క నాటుతున్న ఫౌండేషన్ సభ్యులు

పుత్తూరు: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచడం అందరి బాధ్యతని డాక్టర్ రాజేశ్వరి తెలిపారు. గురువారం పుత్తూరు మండలం వేపగుంట గ్రామంలో విజయ్‌కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణలో యువత చురుకైన పాత్ర పోషించాలన్నారు. ఫౌండేషన్ ప్రెసిడెంట్ భాగ్యరాజ్ మాట్లాడుతూ గ్రామస్తులు, యువకులు, విద్యార్థులు పాల్గొనడం సంతోషకరమన్నారు. రావి, నేరేడు తదితర రకాలకు చెందిన 120 మొక్కలు నాటామని తెలిపారు. స్థానిక యువత చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రామకృష్ణ, దీపక్, భరత్, తిల్లు, విష్ణు, వెంకట్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మృతులకు ఘన నివాళి


సీకేపురంలో నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి


మారేడుపల్లిలో నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

గంగాధరనెల్లూరు: మండలంలోని మారేడుపల్లి గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకుడు పెద్దబ్బరెడ్డి(80) బుధవారం రాత్రి అనారోగ్యంతో మరణించారు. సమాచారం అందుకున్నా మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి గురువారం మారేడుపల్లి గ్రామంలో పెద్దబ్బరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట చిన్నమ్మరెడ్డి, బండి హేమసుందరరెడ్డి, డేవిడ్, భాస్కర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: మండలంలోని సీకేపురం గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకుడు, మాజీ జవాన్ ఉమాయ్య(57) బుధవారం సాయంత్రం అనారోగ్యంతో మరణించారు. సమాచారం అందుకున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి గురువారం సీ.కే.పురం గ్రామంలో ఉమాయ్య మృతదేహనికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు గురవారెడ్డి, జిల్లా క్రియాశీలక కార్యదర్శి కుప్పయ్య, సర్పంచ్ హరిత, ఎంపీపీ సరిత, నాయకులు జనార్దన్, జయ, యోగానందం, మణి, ఆనంద్, రఘు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి


సీడీపీఓ శోభారాణిని సన్మానిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కార్వేటినగరం: అంగన్‌వాడీ సిబ్బంది విధి నిర్వహణలో సమయపాలన తప్పనిసరిగా పాటించాలని ఐసీడీఎస్ సీడీపీఓ శోభారాణి అన్నారు. గురువారం ఆమె కార్వేటినగరం సీడీపీఓగా పదవీబాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిచ్చాటూరు సీడీపీఓగా పని చేస్తూ బదిలీపై కార్వేటినగరం వచ్చినట్లు తెలిపారు. కార్వేటినగరంలో సీడీపీఓగా విధులు నిర్వహిస్తున్న పద్మసునంద గంగాధరనెల్లూరుకు బదిలీపై వెళ్లినట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీలు పౌష్టికాహారం పంపిణీలో నిర్లక్ష్యం వహించినా, విధులకు సక్రమంగా హాజరు కాకపోయినా శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు శోభారాణిని శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

తల్లికి వందనానికి మంగళం


మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

గంగాధరనెల్లూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమలు చేస్తామన్న తల్లికి వందనం పథకానికి మంగళం పాడారని వైఎస్ఆర్ సీపీ మండల కన్వీనర్ వెంకట్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్ హామీలతో ఓట్లు వేసుకుని, ప్రజలను మోసం చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు. పాఠశాల తెరిచిన వెంటనే పాఠ్యపుస్తకాలు, విద్య సామగ్రిని అందిస్తామన్న కూటమి ప్రభుత్వం విద్యా కిట్లు నాసిరకంగా అందిస్తున్నారని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమానికి మండల యువజన విభాగం అధ్యక్షుడు కిషోర్‌రెడ్డి, నాయకులు మునిరాజరెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, ఢిల్లీ, వాసుదేవరెడ్డి, రాజేంద్రనాయుడు, విష్ణు, అశోక్, రాజు, అరుణ్ పాల్గొన్నారు.

పిల్లలను బడికి పంపాలి.. పనికి కాదు

- డీఎస్పీ సయ్యద్ మొహమ్మద్ అజీజ్
- బాల కార్మికులను ఉంచుకున్న ఒక దుకాణంపై కేసు నమోదు


బాల కార్మికులున్న దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు


ర్యాలీ నిర్వహిస్తున్న డీఎస్పీ, లేబర్ ఇన్‌స్పెక్టర్

నగరి: బడిఈడు పిల్లలు బడికే వెళ్లాలి గానీ పనికి కాదని డీఎస్పీ సయ్యద్ మొహమ్మద్ అజీజ్ అన్నారు. ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణ పరిధిలోని దుకాణాలు, వ్యాపార సంస్థల్లో బాల కార్మికులపై లేబర్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌తో కలిసి తనిఖీ నిర్వహించారు. బాలకార్మికులను పనిలో ఉంచుకున్న ఒక దుకాణదారుడిపై కేసు నమోదు చేశారు. అనంతరం పట్టణ పరిధిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు బడికి వెళ్లాలి గానీ పనికి కాదన్నారు. భారతదేశం ఎదుర్కొంటున్న అతి పెద్ద సామాజిక సవాళ్లలో బాలకార్మిక వ్యవస్థ ఒకటన్నారు. పేదరికం, నిరక్షరాస్యత, సాంఘిక కట్టుబాట్లు, చౌక శ్రామికుల కోసం పెరుగుతున్న డిమాండ్ ఈ అంశాలన్నీ కలిసి పిల్లల భవిష్యత్తును చీకట్లోకి నెడుతున్నాయన్నారు. దీనిని వేళ్లతో సహా పెకిలించి, చిన్నారుల ముఖాలపై చిరునవ్వులు పూయించడానికి ప్రతిఒక్కరు కష్టపడాలన్నారు. పేదరికాన్ని విద్యతోనే జయించవచ్చని పిల్లల తల్లిదండ్రులు తెలుసుకోవాలన్నారు. బాల కార్మిక వ్యవస్థ అంతానికి తీసుకోవలసిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ దినోత్సవం ప్రధాన లక్ష్యమన్నారు. 5 నుండి 18 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు ఎక్కడ పనిలో కనిపించినా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ విజయనాయక్, పోలీసులు, ఆటోడ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

హనుమంతుడిపై శ్రీహరి చిద్విలాసం


హనుమంత వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

వడమాలపేట(విజయపురం): అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజు గురువారం స్వామివారు హనుమంత, గజ వాహనాలపై విహరించారు. పట్టుపీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలతో ముగ్ధ మనోహర రూపంలో గోవిందుడు హనుమంతుడి భుజాలపై ఆశీనుడై అశేష భక్తులను కటాక్షించారు. ఉదయం 5 గంటలకు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి విశ్వరూప దర్శనం, తోమాల సేవ, కొలువు, అర్చన, మొదటి గంట తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి హనుమంత వాహనంపై శ్రీరామావతారం అలకారంలో శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి భక్తులను అనుగ్రహించారు. హనుమంత వాహనంపై ఊరేగుతుండగా అశేష భక్తుల గోవింద నామస్మరణతో మాడవీధులు మార్మోగాయి. తదుపరి శుద్ధి, రెండో గంట కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పుణ్యాహవచనం, వసంతోత్సవాలను వేద పండితులు వైభవోపేతంగా నిర్వహించారు. శ్రీవారి గ్రామోత్సవం అనంతరం 6.30 గంటలకు గజ వాహనంపై అభయమిస్తున్న గోవిందుడు వాహన మండపంలోకి వేంచేపు చేశారు.

గజరాజుపై శ్రీవారి అభయం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి 7 గంటలకు స్వామివారు పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకృతుడైన స్వామివారు గజ వాహనంపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, చిన్నారుల కోలాటాల నడుమ అశేష భక్తజనం స్వామివారిని కనులారా వీక్షించి తరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్, ఏఈఓ దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సూర్యప్రభ వాహనంపై స్వామివారు దర్శనమిస్తారు. సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు ఊంజల్ సేవ, రాత్రి 7 గంటల నుంచి 8 వరకు చంద్రప్రభ వాహనంపై స్వామివారు విహరిస్తారు.